## రిపోర్టర్లు కావలెను

'ఆకాంక్ష' దినపత్రికలో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను

Web Site : akankshanews.com
M : akankshanewsdaily@gmail.com

ఆకాంక్ష డైలీ దినపత్రిక

స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

ఎడిటర్ : పెనుగొండ సతీష్, సెల్ : 8333818121
చీఫ్ ఎడిటర్ దాట్ల జెమ్స్‌రెడ్డి సెల్ : 9059188532



# ఆకాంక్ష

T/TG/2024/0523/7229/1544

తెలుగు సంచలన దిన పత్రిక



కె.నరసింహా చారి
9866471343

## రామాంజనేయ దస్తావేజు లేఖరి

రామగుండం సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగ

డాక్యుమెంట్ రైటర్

రిజిస్ట్రేషన్లు, E.C లు,
దస్తావేజుల నకల్,మార్కెట్ వ్యాల్యు,
మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు చేయబడును.



పబ్లిష్ : తెలంగాణ | శుక్రవారం 16 -05-2025 | సంపుటి : 01 సంచిక :158 | ఎడిటర్ ; పెనుగొండ సతీష్ | పేజీలు ; 08 | వెల ; 5 రూ/-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla




- కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం
- సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి



# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం



**కాళేశ్వరం,మే15(ఆకాంక్ష ):** కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో మిగతాది 2 లో...

# పాక్ అదుపులో 21 రోజులపాటు నరకం

## కళ్లకు గంతలు కట్టి మాటలతో హింస




**న్యూఢిల్లీ, మే15 (ఆకాంక్ష ):** పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారని సమాచారం. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు మిగతాది 2 లో...

# ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

## రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?

- రాష్ట్రపతి,గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు
- తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం
- సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి
- రాజ్యాంగ ధర్మాసం సమాధానం ఇస్తుందా అన్న ఉత్కంఠ



**న్యూఢిల్లీ, మే15 (ఆకాంక్ష ):** తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం మిగతాది 2 లో...

# 8వేల కోట్ల ఫీజు బకాయిలు

## తక్షణమే చెల్లించి ఆదుకోండి ■ సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

**హైదరాబాద్,మే15(ఆకాంక్ష ):** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు మిగతాది 2 లో...



# అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

## కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

- సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా
- మండిపడ్డ మంత్రి సీతక్క



**ములుగు, మే15 (ఆకాంక్ష ):** మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్స్ వరంగల్ వేయి స్తంభాల మిగతాది 2 లో...

# క్యాన్సర్‌తో మృతిచెందిన కుటుంబానికి బాసట

## రూ.7లక్షల ఆర్థిక సాయం అందించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, మే15 (ఆకాంక్ష ):** అల్లారుముద్దుగా పెంచుకున్న పాప ఒక్కసారిగా అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తీసుకెళితే బ్లడ్ క్యాన్సర్ అని పరీక్షల్లో తేలింది. పాపను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించారు. విషయం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో పాప చికిత్సకు రూ. 8 లక్షలు మంజూరు చేశారు. వ్యాధి ముదరడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. ఆమె చికిత్సకు గతంలో చేసిన వ్యయానికి



సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు ఆ మొత్తాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వేదవల్లికి (5) 2022లో తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ క్యాన్సర్ అని తేల్చారు. పాపను రక్షించుకునేందుకు మిగతాది 2 లో...

# రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్

## ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసు నటుడు బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు



**హైదరాబాద్, మే15 (ఆకాంక్ష ):** తనపై నమోదైన కేసు విషయంలో నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ గురువారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. అవసరం ఉన్నప్పుడు కోర్టు విచారణకు హాజరు కావాలని నటు-డికి పోలీసులు సూచించారు. శ్రీనివాస్ కారును సీజ్ చేసి, నోటీసులు ఇచ్చి పంపారు. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీలో నివాసం ఉంటున్న బెల్లకొండ శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్న సమయంలో రాంగ్ రూట్‌లో కారు నడిపినట్లు- పోలీసులు గుర్తించారు. తనని అడ్డుకున్న ట్రాఫిక్ పోలీసుతో ఆయన దురుసుగా ప్రవర్తించారు. దీంతో, ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. టాలీవుడ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌కు జూబ్లీహిల్స్ పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని ఇప్పటికే కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు, వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ట్రాఫిక్ మిగతాది 2 లో...

# స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

- కనిష్ట ధర 12..గరిష్ట ధర 75కు పెంపు
- 17వ తేదీనుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటన

**హైదరాబాద్,మే15(ఆకాంక్ష ):** మెట్రో రైలు ప్రయాణించే ప్రయాణికులకు ధరలవాత మొదలయ్యింది. ధరలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైలు ఛార్జీలు పెంచుతున్నట్లు- హైదరాబాద్ మిగతాది 2 లో...



# వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్

## ముంబై, హైదరాబాద్‌లలో ఇడి సోదాలు ■ భారీగా నగదు, ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్, మే15 (ఆకాంక్ష ):** హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు



## పాక్ అదుపులో 21 రోజులపాటు నరకం

రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు- కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు- భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్ పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్లుతున్నాయని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

## స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

మెట్రో రైలు సంస్థ గురువారం ప్రకటించింది. ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు మే 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులువుగా ప్రయాణికులను ఈ మెట్రో రైలు గమ్యస్థానాలకు చేరుస్తుంది. అటు ఎల్ బీ నగర్ నుంచి ఇటు మియాపూర్ వరకు.. అలాగే ఇటు నాగోలు నుంచి అటు రాయదుర్గం వరకు ప్రయాణించే ఈ మెట్రో రైలు నగరవాసులను అతి కొద్ది కాలంలోనే ఆకట్టు-కుంది. ప్రతి రోజు ఈ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. నగరంలో భారీ వర్షం పడినప్పుడు.. ప్రయాణికులు ఈ మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విశ్వ నగరం వేదికగా క్రికెట్ మ్యాచ్‌లు జరిగినప్పుడు.. మెట్రో ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. అయితే మెట్రో నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఛార్జీల పెంపు ప్రతిపాదన గతంలోనే వచ్చింది. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాడు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై మెట్రో రైలు సంస్థ వెనకడుగు వేసింది. కానీ మెట్రో రైలు సేవల కారణంగా.. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోంది. దీంతో ఛార్జీల పెంపు అనివార్యమైందని తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు- సమాచారం. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు భారీ నష్టాలతో నడుస్తుందని ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెట్రో ఛార్జీలు పెంపు అనివార్యమని స్పష్టం చేసింది. దీంతో మే 10వ తేదీ తర్వాత మెట్రో ఛార్జీలు పెంచుతామని ఇప్పటికే స్పష్టం చేసింది. అందులోభాగంగా మే 17వ తేదీ నుంచి ఈ ఛార్జీల పెంపు వర్తిస్తుందని ఆ సంస్థ వెల్లడించింది. ప్రభుత్వం అందిస్తున్న మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు నష్టాల బాటలో నడిచేందుకు ఇది ఒక కారణమని ఎల్ అండ్ టీ- సంస్థ ఇప్పటికే అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయినా మెట్రోలో ప్రయాణించందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు.

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు. అబద్దాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు. అధికారం పోయాక.. ప్రజలు, ఆత్మగౌరవం మీకు గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు.

## వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్

నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ- డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేసి.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా గురువారం ముంబయి, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. ముంబయిలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు- స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు 2009 నుంచి అనుమతులు ఇచ్చారు. ఈ కేసులో సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా కీలక నిందితులుగా ఉన్నారు. నిందితులు అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు విక్రయించినట్టు- దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగా వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ- డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో నిందితుల ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబీ పార్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200

## ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా? గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. వర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశిరచింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

## రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్

కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా బెల్లంకొండ శ్రీనివాస్ వ్యవహరించినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే శ్రీనివాస్ కారును పోలీసులు సీజ్ చేసినట్లు- తెలుస్తోంది. ఈనెల 13న రోడ్ నెంబర్ 45 మీదుగా జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలోని చౌరస్తా వద్ద హీరో బెల్లంకొండ శ్రీనివాస్ రాంగ్‌రూట్‌లో తన నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అదే సమయంలో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న నరేష్ అనే కానిస్టేబుల్ బెల్లంకొండ శ్రీనివాస్ వాహనాన్ని అడ్డుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లొద్దంటూ ఆయనకు సూచించారు. అయితే, కానిస్టేబుల్ చెబుతున్నప్పటికీ కూడా బెల్లంకొండ శ్రీనివాస్ ఏమాత్రం వినకుండా రాంగ్ రూట్‌లోనే ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు బెల్లంకొండ శ్రీనివాస్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. కారును ఆపేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రయత్నించగా.. ఆయన మీదుగానే కారును పోనిచ్చేందుకు హీరో యత్నించారు. ఇదే సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హీరోపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సరస్వతీ పుష్కరాలు ప్రారంభం



ఇవాల్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ నది పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు- పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు- చేశారు.

## క్యాన్సర్‌తో మృతిచెందిన కుటుంబానికి బాసట

రెండేళ్ల పాటు తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. చికిత్స వ్యయం నానాటికీ భారమవడంతో 2024లో ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వేదవల్లి చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలను మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. ఆమె చికిత్సకు గతంలో ఆ కుటుంబం పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది. దీంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.7 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు వేదవల్లి తండ్రి రఘుకు గురువారం సచివాలయంలో అందజేశారు.



## దామోదర్ సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు సేవలు భేష్....





**శ్రీకాకుళం, మే 15 :** దేశ రాజకీయాల్లో తొలితరం నేతల్లో నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన నేతల్లో మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య ఒకరని.. అట్లాంటి మహనీయుని పేరట శ్రీకాకుళం లో ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న కీర్తి శేషులు ఎస్ ఆర్ గంజి కుమారుడు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా ధన్యులు అని వక్తలు కొనియాడారు.. గురువారం శ్రీకాకుళం నగరంలో ద్వారకా నగర్ కాలనీ ఉన్న ఖ్యాతి ఫౌండేషన్ ఆవరణలో కీర్తి శేషులు ఎస్ ఆర్ గంజి... మరియు ఎస్. సంజీవయ్య ల నాల్గవ వర్ధంతి వేడుకలు శ్రీ దామోదర సంజీవయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ కొంక్యాన మురలీధర్ మాట్లాడుతూ.. దళిత హక్కుల పరిరక్షణ కోసం ఎస్ ఆర్ గంజి కుటుంబం అంకిత భావంతో పనిచేస్తూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రజల ఆదరాభిమానాలు సంపాదించింది అని అన్నారు. తొలితరం కాంగ్రెస్ నేతలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసికొని రాష్ట్రంలో దళిత హక్కుల పరిరక్షణ కు పాటుపడే నేతల్లో ఎస్ ఆర్ గంజి ఒకరని కొనియాడారు.. ఎస్ ఆర్ గంజి రెండవ కుమారుడు గంజి సంజీవయ్య కోవిద్ లో మరణించిన తర్వాత ఏటా ఆయన పేరుతో సంస్మరణ సభ ఏర్పాటు చేసి అనాధులకు.. అన్నార్తులకు బాసటగా నిలిచే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా సేవలు మరువలేనివి అని కొనియాడారు.. కీర్తి శేషులు ఎస్ ఆర్ గంజి.. మరియు గంజి సంజీవయ్య ల పేరట ఒక అవార్డ్ ఏర్పాటు చేసి ప్రతీ ఏటా వారి సంస్మరణ సభ రోజు ఉత్తమ సామాజిక సేవకులకు అందిస్తే బాగుంటుందని దళిత సంఘాల సమాఖ్య నేత.. నూతులపాటి భరత్ భూషణ్ సూచించారు. సంజీవయ్య ట్రస్టు పేరుతో చేస్తున్న సేవలు భేష్ అంటూ జర్నలిస్టుల ఐక్య వేదిక కన్వీనర్ శాసపు జోగినాయుడు... రాష్ట్ర ఎస్ సి.. ఎస్ టి ఉపాధ్యాయ సంఘాల నేత పోతల దుర్గారావు... జాఫ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు జి. షన్ముఖరావ్ల అంపోలు ప్రతాపు లు అన్నారు. అంతకన్నా ముందు ఖ్యాతి ఫౌండేషన్ లో ఉన్న అనాధులకు అన్నదానం.. వస్త్రదానం అతిథుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు... దళిత సంఘాల నేతలు పి అప్పన్న,బి వేణుగోపాల్ రావు,కె అనీ రోజ్ ,కె ఎన్ మూర్తి,ఆర్ పి రావు ,గొల్లపల్లి నందేష్ పాల్గొన్నారు..

## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయాల్సిందే

### అప్పుడే సింధూజలాల గురించి ఆలోచిస్తాం

### విదేశాంగశ్శాఖ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మే15 (ఆకాంక్ష):** ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి మంచి మద్దతు లభిస్తుందని భారత విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయంపై మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేసే వరకూ ఈ ఒప్పందం నిలిపివేయబడుతుందన్నారు. ఈ క్రమంలో కశ్మీర్‌పై చర్చించాల్సిన ఒకే ఒక అంశం ఉందన్నారు. అది పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయడం. దీని గురించి చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ మరోసారి స్పష్టం చేశారు. కశ్మీర్ సమస్యపై ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా,ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ ఈ సలహాను పట్టించుకోలేదన్నారు. భారతదేశంపై చేసిన దాడికి మా సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు. శాటిలైట్ చిత్రాలు ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు జరిగిన భారీ నష్టాన్ని, భారతదేశానికి అతి తక్కువ నష్టాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని జైశంకర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తీవ్రవాద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థను నిషేధించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ డిమాండ్ చేసింది. ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సమర్పించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. జైశంకర్ ఈ విషయంపై మాట్లాడుతూ పహల్గామ్ దాడిలో దోషులకు కఠిన శిక్ష విధించాలని ఐక్యరాజ్య సమితి సభ్యులు స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్‌కు అంతర్జాతీయ మద్దతు లభిస్తోందన్నారు. భారత్ దాడి తర్వాత పాకిస్థాన్ కూడా చైనా డ్రోన్‌లను ఉపయోగించినట్లు- జైశంకర్ వ్యాఖ్యానించారు. ప్రపంచం ఈ దాడిని చూసిందని అన్నారు.

# జానపదాలు జగతికి జీవనాడులు

## జానపద పురస్కారం అందుకున్న సింగర్ ఆదేర్ల యాదమ్మ




**ఆకాంక్ష , మే 15(ఇబ్రహీంపట్నం ప్రతినిధి):** తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రజా కళా వేదిక డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చర్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన మన పల్లె జానపదం జాతర కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల తులే కలాన్ గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ ఆదెర్ల యాదమ్మ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెకు జానపద పురస్కారం లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హరి సర్వోత్తమ నాయుడు డాక్టర్ మురళీధర్, ప్రముఖ కవి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నారాయణస్వామి, సినీ గీతా రచయిత కవి సురేంద్ర పాల్గొని షీల్డ్ ప్రశంస పత్రంఇచ్చి సన్మానం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన 300 మంది జానపద కళాకారులకు పాటకు పట్టాభిషేకం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజా కళా వేదిక అధ్యక్షుడు అరవ జయపాల్ మాట్లాడుతూ... జానపదాలు జగతికి జీవ నాడులు అని తెలిపారు. అనంతరం యాదమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాకారుల కు సహకారం అందిస్తే జానపద కళను సమాజానికి తెలియపరిచే విధంగా నా చిన్నతనం నుండి సుమారు 200 పాటల వరకు నేర్చుకున్నాను. కొన్ని పాటలు స్వయంగా తానే రచించి పాడానని, నా పాటలు ద్వారా నేటి సమాజంలో మధ్యతరగతి, పేదవారి అభ్యున్నతికి, తోడ్పడే విధంగా కృషి చేస్తానని తెలిపారు. యాదమ్మకూ పురస్కారం లభించడం పట్ల తులేకలాన్ గ్రామ ప్రజలు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# 17న జరగబోయే మహనీయుల విగ్రహాల విష్కరణ వాయిదా

## జూన్ 4వ తారీఖు యధావిధిగా అంబేద్కర్ జగ్జీరా విగ్రహాల ఆవిష్కరణ



**నాగారం, తుంగతుర్తి మే 15 (ఆకాంక్ష ప్రతినిధి):** నాగారం మండలం పసునూరు గ్రామంలో 17 తారీకు జరగబోయే అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడడం జరిగిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కళామండలి అధ్యక్షులు డాక్టర్ మల్లెపాక అనిల్ కుమార్ మాదిగ , అణగారిన వర్గాల ఆశాజ్యోతి పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ అత్యవసరంగా ఢిల్లీకి వెళ్ళవలసిన అవసరం వచ్చింది కాబట్టి మే 17న పసునూరులో జరగబోయే అంబేద్కర్ జగ్జీవన్ రావు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం వచ్చేనెల జూన్ 4వ తారీఖు ఆవిష్కరించడానికి నిర్ణయించారు. విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ సైదులు,మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా నాయకులు పోతరాజు వెంకన్న, మల్లెపాక గణేష్, మాదిగ బొజ్జ ఎల్లయ్య మాదిగ, మల్లె పాక కిరణ్, బొజ్జ నాగరాజు, బొజ్జ వెంకన్న,నరాల పాపయ్య,ఆరేంపుల ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ బిర్యానీ లో బల్లి



**ఆకాంక్ష , మే 15(ఇబ్రహీంపట్నం ప్రతినిధి):** చికెన్ బిర్యానీ లో బల్లి కనిపించిన ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడుతెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నం కేంద్రం లో సాగర్ రోడ్డు లో ఉన్న" మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్" లో శేరిగూడ గ్రామానికి చెందిన గుజ్జా కృష్ణ రెడ్డి గురువారం మధ్యాహ్నం బిర్యానీ తినడానికి రెస్టారెంట్ కు వెళ్లారు. ఆయన చికెన్ బిర్యానీ ఆర్డర్ చేయగా బిర్యానీ ని తినడం మొదలుపెట్టాడు.బిర్యానీ లో బల్లి కనిపించడం తో ఒక్కసారిగా షాక్ కు గురైయ్యాడు. వెంటనే యజమాని నీ నిల దీయగా ఆయన మంచిగా ఫ్రై అయింది తిను అంటూ వ్యంగంగా చెప్పడంతో కంగుతిన్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు 100 కు డయల్ చేయగా వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని బిర్యానీ తిన్న బాధితుడిని టెస్టుల కోసం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

# మిడ్జిల్ మండల బీజేపీ నూతన కమిటీ నియామకం.



**ఆకాంక్ష , మే 15, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్:** మిడ్జిల్ మండల కేంద్రంలో బీజేపీ సమావేశం మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశం అనంతరం మండల పూర్తిస్థాయి కమిటీ నియమించారు. మండల సహ్ ఇంచార్జ్ లక్ష్మారెడ్డి , బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వర రెడ్డి లు మాట్లాడుతూ.. పార్టీని గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలలో బిజెపి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న పథకాలు, బిజెపి దేశానికి చేస్తున్న సేవలు ప్రజలకు వివరించి బీజేపీ పై ఆకర్షితులుగా చేసేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు అంజి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు, వాసు దేవ్, పిఎసిఎస్ డైరెక్టర్ భీమయ్య, మండల ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఎల్లయ్య, సీనియర్ నాయకులు భీమయ్య, శేఖర్, వస్పుల్ ఆంజనేయులు,వెంకటయ్య, బుచ్చయ్య, నవీన్, ప్రేమ్ కుమార్, రాహుల్ నాయక్, గంగు నాయక్, మహేష్, దర్శన్, బండారి లక్ష్మణ్, శివ శంకర్, హుస్సేన్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పాస్ పోర్ట్, వీసాలు సృష్టిస్తున్న ముఠా గుట్టు రట్టు

## చదువు రాని కూలీల టార్గెట్ ▪ దుబాయిలో ఎక్కువ డబ్బులు వస్తాయని మోసం

- ఇద్దరు నిందితులను అరెస్టు మరో ముగ్గురు పరార్
- 14 టాంపర్డ్ వీసాలు, 14 పాస్ పోర్ట్ లు, 7 సెల్ ఫోన్లు, ఒలాఫ్ టాబ్ స్వాధీనం



**ఆకాంక్ష ,మే 15 (రాజేంద్రనగర్ ప్రతినిధి):** చదువురాని అమాయక కూలీలను టార్గెట్ చేసి దుబాయ్ లాంటి విదేశాల్లో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని నకిలీ పాస్ పోర్ట్, వీసాలతో మోసగిస్తున్న ముఠా గుట్టును శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, ఎస్ ఓ టి పోలీసులు రట్టు చేశారు. ఐదుగురు ముఠా సభ్యుల్లో పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి 14 వీసాలు,14 పాస్ ఫోర్టులు, 2 స్టాంపులు, ఓ స్టాంపు ప్యాడ్,7 సెల్ ఫోన్ లు, ఒక ల్యాఫ్ టాబ్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నాను.ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను శంషాబాద్ ఆర్.జి.ఐ పోలీస్ స్టేషన్ లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్ గౌడ్ పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ఏ-1 ప్రధాన నిందితుడైన పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ, మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన సత్యనారాయణ,ఏ-2 హైదరాబాద్ ఆసిఫ్ నగర్ కు చెందిన అంజి అలియాస్ పెనెగలపాటి రామాంజనేయులు, ఏ-3 పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ, రాఘవేంద్ర నగర్ కు చెందిన చిలుకూరి బాలాజీ(43),ఏ-4 ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లా, ఓబులవారిపల్లి మండల్,చెన్న రాజు పోడు గ్రామానికి చెందిన సుంకర శివకుమార్(30),ఏ-5 కడప జిల్లా రాయచోటికి చెందిన గోపాల్ ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన చదువురాని కూలీలను ఎంచుకొని దుబాయికి పంపిస్తామని అక్కడ ఎక్కువ డబ్బులు సంపాదించుకోమని ఆశ కల్పిస్తారు. మొదట వారికి వర్కింగ్ వీసాతో పంపిస్తారు. ఆ తర్వాత వీసాలను రద్దుచేసి వాటి స్థానంలో విజిటింగ్ వీసాలను తయారుచేసి తమ బంధువుల వద్దకు వెళతామని నమ్మబలకి ఎయిర్పోర్ట్ నుంచి దుబాయ్ పంపుతారు. ఇలా 8 మందిని ఎయిర్ పోర్టు నుంచి దుబాయ్ కి పంపిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎయిర్పోర్ట్ పోలీసులు,ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు చేసి నిందితులను అరెస్టు చేశారు.ఏ-3 చిలుకూరి బాలాజీ,ఏ-4 సుంకర శివకుమార్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులైన ఏ- 1,2,5 సత్యనారాయణ,అంజి, గోపాల్ పరారీలో ఉన్నట్లు ఏసిపి తెలిపారు. డబ్బు మీద ఆశతో ఇలా ఎవరు పడితే వాళ్ళు మాయమాటలు చెప్తే నమ్మి మోసపోవద్దని ఏసిపి శ్రీకాంత్ గౌడ్ ప్రజలకు సూచించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించి ప్రత్యేక రివార్డులను అందజేశారు. ఈ ప్రెస్ మీట్ యందు ఎస్ఓటి శంషాబాద్ ఇన్స్పెక్టర్ సంజయ్ కుమార్ ఆర్ జి ఐఏ పోలీస్ అవుట్ పోస్ట్ ఇన్స్పెక్టర్ జె.బాలరాజు, ఆర్.జి.ఐ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.బాలరాజు, ఆర్ జి ఐ ఏ ఇన్స్పెక్టర్ తరుణ్ రెడ్డి ఎస్ఓటి శంషాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ యూకే సిద్దేశ్వర్ ఎస్ఓటి శంషాబాద్ జోన్ కానిస్టేబుల్స్ కే. శివకుమార్, ధర్మారెడ్డి, ఇతర కానిస్టేబుళ్లు వంశీకృష్ణ కే రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు కోతల నివారణకు ప్రత్యేక చర్యలు.

## అందులో భాగంగానే నూతనంగా 10 ట్రాన్స్ఫార్మర్ల బిగింపు.

- త్వరలో మరో మూడు బిగిస్తాం.
- ఇస్నాపూర్ ఏడి తులసి రామ్ నాయక్ వెల్లడి.

**పటాన్చెరు, మే 15 ఆకాంక్ష .** పటాన్చెరు మండల పరిధిలో విద్యుత్తు కోతల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి అందులో భాగంగానే 160 కె.వి ట్రాన్స్ఫార్మర్లు మూడు వంద కేవి ట్రాన్స్ఫార్మర్లు 6 మరో అదనంగా సాయి ప్రియ కాలనీలో ఒక ట్రాన్స్ఫార్మర్ బిగించి నట్లు ఇస్నాపూర్ ఏడి తులసీ రామ్ నాయక్ తెలిపారు. గురువారం ఇస్నాపూర్ లో "పద్మ క్రాంతి" "విలేకరి" తో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా తమ ప్రాంత పరిధి లొఎక్కడి నుండి ఎలాంటి సమాచారం, లేదా ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా మరో ఆరు నెలల్లో అవసరాన్ని బట్టి ఏ, ఏ కాలనీల్లో ఉండే ఇండ్ల శాతాన్ని బట్టి ఆయా కాలనీల్లో అదనపు ట్రాన్స్ఫార్మర్లు బిగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వేసవికాలం చివరి దశలో ఉండి, ఎండలు విపరీతంగా మండుతుండడం వల్లా విద్యుత్ వినియోగం పెరగడంతో పాత ట్రాన్స్ఫార్మర్ల పై అధిక భారం పడి అప్పుడప్పుడూ విద్యుత్తు సరఫరా లో అంతరాయం జరుగుతున్న మాట వాస్తవమేనని ఆయన అన్నారు. అయితే వర్షాకాలం ఆరంభానికి ముందు ఈదురు గాలులు వీయడం వల్లా సైతం విద్యుత్ అంతరాయం ఏర్పడడం సహజమే నని ఆయన తెలిపారు. అన్ని సమస్యలను అధిగమించి తమ పరిధి విద్యుత్తు వినియోగదారులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

**సమిష్టి కృషితో విద్యుత్తు సరఫరా లో అంతరాయం లేకుండా చూస్తున్నాం:ఇస్నాపూర్ ఏఈ వీరాంజనేయులు.**



విద్యుత్తు కోతల అంతరాయాలను వెంటనే గుర్తించి తమ సిబ్బంది అంతా కలిసి సమిష్టి కృషితో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలను అధిగమిస్తున్నామని ఇస్నాపూర్ ఏఈ వీరాంజనేయులు తెలిపారు. అంతేకాకుండా ఇస్నాపూర్ కూడలి ప్రాంతంలో తరచు ఫ్లెక్సీల ద్వారా జరిగే ఇబ్బందులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ సమస్యను గుర్తించి అధిగమించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వేసవికాలం లో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉండడం సహజమే. దీంతోపాటు ఎండల ప్రభావంతో సైతం విద్యుత్ అంతరాయం కలగడం వల్ల ప్రజలకు అప్పుడప్పుడు ఇబ్బంది కలుగుతుందని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రణాళికలు రచించి విద్యుత్తు అంతరాయం లేకుండా చూసుకుంటామని ఈ సందర్భంగా ఏఈ వీరాంజనేయులు అన్నారు.

# తక్కువ ఎరువులను వినియోగించి అధిక దిగుబడులను పొందాలి



**ఆకాంక్ష , మే 15 (చేవెళ్ల- ప్రతినిధి):** వరి పంట సాగులో వివిధ యాజమాన్యాల పద్ధతుల ద్వారా తక్కువ ఎరువులను వినియోగించి అధిక దిగుబడులను పొందాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.జి మహాదేవప్ప రైతులకు సూచించారు. గురువారం మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణీ అనురాధ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాస్త్రవేత్త ఎస్ .జి మహాదేవప్ప హాజరై రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. వరి పంటకు ముందుగా పచ్చ రొట్ట ఫైర్ ను సాగు చేసి నేలలో కలియ దున్ని నేల ఆరోగ్యాన్ని సారవంతతను పెంపొందించాలన్నారు. అలాగే నీరు మరియు ఎరువుల యజమాన్యం, పంట మార్పిడి,చెట్లను పెంచడం, పర్యావరణ సంరక్షణ మొదలైన అంశాలపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం మరో శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అపరాల పంట సాగు మరి మరియు యాజమాన్య పద్ధతులను తెలియజేస్తూ నేల యొక్క సారవంతతను పెంపొందించే విషయాలపై చర్చించారు. అనంతరం చేవెళ్ల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బీజె సురేష్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సేంద్రియ వ్యవసాయం చిరుధాన్యాల సాగు నేల ఆరోగ్యం మొదలైన అంశాలపై ప్రసంగించారు. మండల వ్యవసాయ అధికారిని అనురాధ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకోవడం,నేలలోని పోషక పరిమాణమును బట్టి రసాయన ఎరువులను వినియోగించడం, ఫామ్ రిజిస్ట్రీ, మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులను తీసుకొని వాటిని భద్రపరచుకోవడం గురించి వివరించారు. అనంతరం ఉద్యాన శాఖ అధికారిణీ కీర్తి కృష్ణ మాట్లాడుతూ వివిధ కూరగాయ పంటలు సాగు చేయడం, ఆయిల్ ఫామ్ పంట సాగు వివరాలు, మేక మరియు గొర్రెల ఎరువులను పండ్లతో తోటల్లో వినియోగించే విధానం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన పిహెచ్ డి స్కాలర్స్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి సునీల్ రైతులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకుంటాం..

## విద్యుత్ ప్రమాదంలో 26 మేకలు గోర్లు మృత్యువాత...



**పెద్దపల్లి ప్రతినిధి ఆకాంక్ష న్యూస్) :** ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన రాజ కొమురయ్య 26 మేకలు, గొర్రెలు వర్షం కారణంగా కరెంట్ షాక్ తో మరణించడంతో బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు పరామర్శించారు. తదుపరి బాధిత కుటుంబనికి ఎమ్మెల్యే విజయరమణ రావు 21,500 /- రూపాయలను ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుటుంబం ఈ ప్రమాదం వల్ల ఎంతో నష్టపోయిందన్నారు. ఈ కుటుంబానికి తాము అండగా ఉంటామని చెప్పారు. సీఎండీ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన సహకారాన్ని బాధిత కుటుంబానికి అందించాలని కోరడం జరిగిందని దీనికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వ పరంగా కూడా సహాయాన్ని అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎ.డి.ఈ, ఎ.ఈ, స్థానిక తహసిల్దార్, సి.ఐ సుబ్బా రెడ్డి మరియు మడక గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# పిల్లలమర్రి మహావృక్షంను సందర్శించనున్న ప్రపంచ సుందరీమణులు.

- మూడంచెల బందోబస్తు ఏర్పాటు
- జిల్లా ఎస్పీ. డి. జానకి, ఐపీఎస్.



**ఆకాంక్ష , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్:** 72వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో ఈ నెల 10వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరుగుతున్న సందర్భంగా శుక్రవారం 16 న సాయంత్రం గం. 5 నుంచి గం. 7 వరకు వివిధ దేశాలకు చెందిన 22 మంది మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సుందరీమణులు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పిల్లలమర్రి మహావృక్షాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్శన సందర్భంగా వారు మొదటగా పిల్లలమర్రి ప్రాంగణంలోని శ్రీ రాజ రాజేశ్వరి ఆలయాన్ని దర్శించుకొని, అనంతరం జిల్లా మ్యూజియం, చివరిగా పిల్లలమర్రి మహావృక్షాన్ని సందర్శించనున్నారు. కంటెస్టెంట్లు సందర్శించే ప్రదేశాలను ముందుగానే జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో పరిశీలించి, భద్రతా పరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం బృందావన్ గార్డెన్ లో బందోబస్త్ నిమిత్తం వచ్చిన 980 పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బందోబస్తుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సామరస్యంతో బందోబస్తు నిర్వహించాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకు ఆటంకం లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమం జిల్లాలో జరగడం గర్వకారణమని, సుందరీమణుల భద్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తూ, శాంతియుతంగా, ఆహ్లాదకరంగా కార్యక్రమం జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్శన ద్వారా పిల్లలమర్రి ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభించనుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసదస్సులో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, సుదర్శన్, శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ రూరల్ ఇన్స్పెక్టర్ గాంధీ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి రవికి "సేవారత్న" అవార్డు



**మేడిపల్లి,ఆకాంక్ష :** సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తుంగతుర్తి రవి"మానవసేవే మాధవసేవ"గా భావించి ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలని దృఢ సంకల్పంతో ఆర్ వి ఫౌండేషన్ స్థాపించి ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు,అనాధ పిల్లలకు పుస్తకాలు,బట్టల పంపిణీ,మండువే సేవలో చలివేంద్రాల ఏర్పాటు, వరద బాధితులకు నిత్యవసర సరుకులు, కోవిడ్ సమయంలో నిత్యం అన్నదానం,నిత్యవసర సరుకుల పంపిణీ,యువకులకు క్రీడా పోటీలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు తుంగతుర్తి రవి. తుంగతుర్తి రవి సమాజ సేవలను గుర్తించి నటరాజ్ అకాడమీ 17వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా తుంగతుర్తి రవిని "సేవా రత్న" అవార్డుతో ఘనంగా సత్కరించింది.హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన ఆడిటోరియంలో నటరాజ్ అకాడమీ,అక్షిత ఫౌండేషన్ సంయుక్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొని తుంగతుర్తి రవిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ మనకున్న దానిలో నలుగురికి సహాయ పడాలని, మన వంతు సామాజిక బాధ్యతగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహిస్తున్నామని,తనను సేవా రత్న అవార్డుతో సత్కరించిన నటరాజ అకాడమీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఈ అవార్డు మరింత ఉత్సాహాన్ని కలిగించిందని తుంగతుర్తి రవి అన్నారు.ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, నటరాజ్ అకాడమీ సభ్యులు,కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థికంగా వెన్నుదన్నుగా కళ్యాణ లక్ష్మి.

### మహేశ్వరం మండలంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**మహేశ్వరం మే 15, (ఆకాంక్ష ప్రతినిధి):** ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఎంతో మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కుటుంబాలకు దీవెనలుగా నిలుస్తున్నాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలంలో అర్హులైన 180 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కదాన్నయినా ఈ ప్రభుత్వం నెరవేర్చిందా? ఎన్నికల సమయంలో మహిళల ఆర్థికాభివృద్ధి, బంగారం, నగదు సహాయం వంటి అనేక గ్యారంటీలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు చెక్కులు అందుకున్న మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం 180 తులాల బంగారం బాకీ ఉందన్నారు. ప్రజల హక్కుల కోసం మేము పోరాడుతూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల తహసిల్దార్ సైదులు, ఎంపిడిఓ శైలజా రెడ్డి, ఎంపీఓ రవీందర్ రెడ్డి, రెవిన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలి.



**వికారాబాద్, మే 15 ఆకాంక్ష ప్రతినిధి:** ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు అయ్యే విధంగా అధికారులు పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ శాఖల పనితీరు, చేపట్టాల్సిన వివిధ అంశాలపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వారికి అందేలా అధికారులు పనిచేయాలన్నారు. ఒక్క శాతం ఉన్న ఉద్యోగులుగా మనం 99 శాతం ఉన్న ప్రజలకు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. రైతులు సన్న రకం బియ్యాన్ని పండించే విధంగా ప్రోత్సహించాలని తెలుపుతూ, సన్న బియ్యం పండించే వారికి అదనంగా 500 రూపాయలు బోనస్ ఇవ్వడంతో పాటు అన్ని కుటుంబాలకు పోషక ఆహారాన్ని అందించే లక్ష్యంగా చౌక ధర దుకాణంల ద్వారా సన్న బియ్యాన్ని ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. రాజీవ యువ వికాస్ పథకం ద్వారా యువతకు ఉపాధి కలిగేలా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ పథకం వివరాలను ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అదే విధంగా విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొంచేవిధంగా అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా పారిశుధ్య వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ కార్యదర్శి అధికారులకు సూచించారు. ప్రభుత్వం రెవిన్యూ సమస్యలు పరిష్కరించే దిశగా భూ భారతి చట్టం ద్వారా వెసులుబాటు కల్పించిందని, ప్రజల సమస్యల పరిష్కార దిశగా అధికారులు అంకితభావంతో పని చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్డిఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కన్నతల్లితో గొడవపడి వలస కూలి ఆత్మహత్య



**ఆకాంక్ష ,మే 15 (రాజేంద్రనగర్ ప్రతినిధి):** కన్నతల్లితో గొడవపడి ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఈ సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.గత 5 సంవత్సరాల క్రితం తన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వంత గ్రామం అయిన ఒడిస్సా రాష్ట్రం, బాలంగిర్ జిల్లా, పట్నాగర్గా, కుహానొంస గ్రామానికి చెందిన సులతనపల్లి లోని భీమ్ మజ్ హి(38), తన భార్య మమత మజ్ హి(30), తల్లి మిహిల్లా మజ్ హి(60) బతుకుతెరువు కోసం వలస వచ్చారు. శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామంలోని వాసు రామ్ ఇటుక బట్టీల వద్ద కులీ పనులు చేసుకుంటూ అక్కడే జీవనం కొనసాగిస్తున్నారు. అయితే తేదీ 14.05.2025 నాడు సాయంత్రం 06:00 గంటలకు బీమ్ మజ్ హి తల్లి మిహిల్లా మజ్ హి తో గొడవపడ్డాడు. అట్టి గొడవను తన మనసులో పెట్టుకొని ఈ రోజు అనగా తేదీ: 15.05.2025 ఉదయం 06:00 గంటలకు భీమ్ మజ్ హి%అ% తమ గదిలో టవల్‌తో రాడ్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ డ్యూటీ వైద్యులు ఆమె భర్తను పరీక్షించి అతడు మృతి చెందినట్లు తెలియజేశారు. తన భర్త మానసిక స్తితి బాగలేదని మరియు తన భర్త మరణం వెనుక ఎవరిపై ఎటువంటి అనుమానం లేదని తెలుపుతూ పిర్యాదురాలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య మమత మజ్ హి పోలీసులను అభ్యర్థించారు. పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ.



**ఆకాంక్ష , మే 15, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :** బాలనగర్ మండలం ఏడుగుట్ల తండాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు బహుజన్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు (బీఎంపీ), లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్.హెచ్.పి.ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్ రామ్ నాయక్, జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హాజరై ర్యాలీలో పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అంబేద్కర్ గొప్పతనంపై వారి సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్రామ్ నాయక్, మాజీ, సర్పంచ్ చందూలాల్ (డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ దాత) , శ్రీకాంత్ నాయక్, శివ నాయక్, రంజీ నాయక్, రాహుల్ నాయక్, రాజారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి

### ధాన్యం ఎగుమతిలో లారీల సంఖ్య పెంచి రైతులకు సహకరించాలి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా మే 15,(ఆకాంక్ష ప్రతినిధి):** సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ జగదీష్, లారీ కాంట్రాక్టర్లతో ధాన్యం ఎగుమతి లారీలు సంఖ్య పెంపుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు మద్దతు ధరను కల్పిస్తూ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందని , లారీ కాంట్రాక్టర్లు ఎక్కువ లారీలను పంపి కొనుగోలు కేంద్రాల ధాన్యాన్ని లోడింగ్ చేసుకుని మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు,రైతులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## విదేశీ సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడమా?




**ఆకాంక్ష , మే 15, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్:** తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ అందెగత్తెల కాళ్లను కడిగించడం ఎంత వరకు సమంజసమని బిజెపి పాలమూరు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. అందాల పోటీల్లో భాగంగా రామప్ప దేవాలయ సందర్శనకు వచ్చిన సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడపడుచుల చేత కడిగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతో పాటు అవమానిస్తారా అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ అందగత్తెల పోటీ పేరుతో తెలంగాణ మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం కాంగ్రెస్ ప్రభుత్వ బానిసత్వానికి, మహిళలపై ద్వేష భావానికి నిదర్శనమన్నారు. ఇది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం మీద దాడని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని అందాల పోటీకి వచ్చిన సుందరీమణుల పాదాల దగ్గర పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడాన్ని బిజెపి మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తోందని విమర్శించారు. మన ఆడబిడ్డలను, దళిత, గిరిజన మహిళలను బానిసలుగా చూస్తారా? సంప్రదాయాలను గౌరవించాలి తప్ప అవమానించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## పొరపాటు ప్రచార సంస్థదే

**మంథని (ఆకాంక్ష న్యూస్) :** సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం లో ఏర్పాటుచేసిన కటౌట్లలో ఏమైన పొరపాట్లు జరిగితే ఆ భాధ్యత వాటిని ఏర్పాటు చేసిన ప్రచార సంస్థదే అని టిపిసిసి ఎన్నికల కమీటి సభ్యులు శశిభూషణ్ కాచె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రచారం సంస్థ చేసిన పొరపాటును భూతద్దంలో చూపించడం సరికాదన్నారు. కటౌట్ల విషయంలో జరిగిన పొరపాటును సరిదిద్దమని ఆదేశించడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారు హిందువుల మనోభావాలను దెబ్బతినేవిదంగా వ్యవహరించారని, ప్రభుత్వ యంత్రాంగం పొరపాటును సరిదిద్దు తుందని ఈ పోరపాటుకు మేము కూడా పశ్చాత్తాపపడుతున్నామన్నారు.

## అన్నం వండుతున్న గిన్నెపై పడి వృద్ధుడు మృతి



**ఆకాంక్ష ,మే 15 (రాజేంద్రనగర్ ప్రతినిధి):** ఇంట్లో నడుచుకుంటూ వెళుతుండగా, శరీరం సహకరించక అక్కడే అన్నం వండుతున్న బోవని గిన్నెపై ఓ వృద్ధుడు పడిపోయి కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న గోల్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. నరేందర్ రెడ్డి కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. 30.04.2025న ఉదయం 09:30 గంటలకు గౌతమ్ అంజయ్య (78) ఇంట్లో నడుచుకుంటూ వెళుతుండగా శరీరం సహకరించక అక్కడే అన్నం వండుతున్న భోవని గిన్నెపై పడిపోయాడు. దీంతో అతడికి ఛాతి ఎడమవైపు, ఎడమ చేతికి కాలి గాయాలయ్యాయి. వెంటనే అంజయ్య కుమారుడైన గౌతం చంద్రశేఖర్(45) తన తండ్రిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. అంజయ్య అప్పటి నుండి ఈనెల 14వ తది రాత్రి 21:44 గంటలకు వరకు అక్కడే హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తన తండ్రి గౌతమ్ అంజయ్య మరణం పై ఎవ్వరి పైన ఎలాంటి అనుమానం లేదని తెలుపుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.



**ఆకాంక్ష , మే15, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :** జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలంలోని వెలుగోముల గ్రామంలో గురువారం జరిగిన శుభకార్యములలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీలర్ రాంరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమం కోసమే ప్రభుత్వం పెద్దపీట.



**మెదక్ జిల్లా, మే 15, (ఆకాంక్ష ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమం, విద్యా ప్రగతి కోసం పెద్దపీట వేస్తుందని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ మిస్టర్ తారిఖ్ అన్సారీ సాహబ్ తెలిపారు మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన మైనారిటీ కమిషన్ చైర్మన్ మిస్టర్ తారిఖ్ అన్సారీ సాహబ్ కు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో మైనారిటీ సంక్షేమం, విద్యా ప్రగతిపై కమిషన్ సభ్యులు కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ సంబంధించిన కళాశాలలు, పాఠశాలల్లో పదవ తరగతి ఇంటర్మీడియట్ ఉత్తమ ఫలితాలు సాధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్ ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి.



**మెదక్ జిల్లా, మే 15,(ఆకాంక్ష ప్రతినిధి):** ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్డిఓ. పిడి. శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ జగదీష్, లారీ కాంట్రాక్టర్లతో ధాన్యం ఎగుమతి లారీలు సంఖ్య పెంపుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు మద్దతు ధరను కల్పిస్తూ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. కాంట్రాక్టర్లు ఎక్కువ లారీలను పంపి కొనుగోలు కేంద్రాల ధాన్యాన్ని లోడింగ్ చేసుకుని మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు, రైతులకు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పరిశీలన



**మెదక్ జిల్లా, మే 15, (పద్మక్రాంతి ప్రతినిధి):** జిల్లాలోని చిలిపిచేడ్ మండల కేంద్రంలోని మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. మంజూరైన పలు దశలలో నిర్మాణంలో ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోందన్నారు. త్వరితగతిన ఇండ్లు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ సహదేవ్, ఎంపీడీవో సంబంధిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాటన్ దొర సేవలు మరువలేనివి:మండలి వెంకట్రామ్

**మోపిదేవి, ఆకాంక్ష :** సాగునీటి రంగానికి సర్ ఆర్థర్ కాటన్ అందించిన సేవలు మరువలేనివి అని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం మోపిదేవి మండలం మోపిదేవి వార్పు వద్ద సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా కాటన్ దొర విగ్రహానికి వెంకట్రామ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు పొన్నూరు రవితేజ, దోవారి విజయ్ కుమార్, సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, మండలి శేషు, మండలి సుధీర్, కమతం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా " అక్షిత ఫౌండేషన్,నటరాజ్ అకాడమీ" 17వ వార్షికోత్సవ వేడుకలు

- విద్య, వైద్య, సామాజిక ,రాజకీయ రంగాల ప్రముఖులకు అవార్డులు
- ప్రాముఖ్యతగా పాల్గొన్న రాష్ట్ర మాజీ ఎస్సీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



**ఉప్పల్,ఆకాంక్ష :** నటరాజ్ అకాడమీ 17వ వార్షికోత్సవ వేడుకలను హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన ఆడిటోరియంలో నటరాజ్ అకాడమీ,అక్షిత ఫౌండేషన్ సంయుక్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, విశిష్ట అతిథిగా హైదరాబాద్ వాటర్ బోర్డ్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 9 గంటల గంటలకు ప్రారంభమైన సంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు నిరవధికంగా నిర్వహించి ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్య,వైద్య, సామాజిక, రాజకీయ, సేవా, కళా రంగాలలో విశేష కృషిచేసిన పలువురుని ప్రత్యేక అవార్డులతో సత్కరించి సన్మానించారు. అత్త చిన్న వయసులోనే రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజాసేవలో విశేష కృషి చేస్తున్న పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ నారెళ్ళపల్లి మధుసూదన్ రెడ్డి కి "ఉత్తమ కళా ప్రపూర్ణ సేవా సార్వభౌమ" బిరుదుతో సత్కరించి స్వర్ణ కంకణాన్ని అందించారు. ఆర్ వి ఫౌండేషన్ స్థాపించి గత ఏడు సంవత్సరాలుగా ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తూ నిరుపేదలకు అనాథలకు అండగా నిలుస్తున్న తుంగతుర్తి రవికి సామా ఉత్తమ" సేవారత్న" అవార్డును అందించారు. అనంతరం నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందిస్తున్న పవన్ సాయి హాస్పిటల్ అధినేత డాక్టర్. ఆలేటి శ్రీనివాస్ గౌడ్,మిరాకిల్ హాస్పిటల్ సీఈవో ఆర్ వరప్రసాద్ లకు వైద్య సేవ రత్న పురస్కారాలు, ప్రముఖ తెలంగాణ ఉద్యమ గాయకుడు మద్దెల సందీప్ కుమార్ కు,ఉత్తమ నాట్య గురువులుగా కృషి చేస్తున్న పలువురికి ఉత్తమ కళా పురస్కారాలను అందించి గౌరవించారు. అనంతరం నటరాజ్ అకాడమీ చైర్మన్ గిరి మాట్లాడుతూ గత 17 వసంతాలుగా అనేక సాంస్కృతిక సేవ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తూ ప్రేక్షకుల ఆధార అభిమానాలు ఆశీస్సులు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని,ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కృషి చేసిన ముఖ్య అతిథులకు అవార్డు గ్రహీతలకు కళాకారులకు నటరాజ్ అకాడమీ సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు.







## కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని...

4 లేబర్ కోడ్లను రద్దుచేయాలి....
సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేసీసీ నాయకులు...




**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని.. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అర్జీ-1 లోని పలు కాంట్రాక్టు కార్మికుల అడ్డాలపై దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ...దేశాన్ని పాలిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. కార్మికుల హక్కులను మోడీ సన్నిహితులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మన పూర్వీకులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి వాటికి మోడీ అనుచరులకు అనుకూలంగా మార్చారని తెలిపారు. ఈ లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కార్మికులు యజమానులకు బానిసలుగా మారే అవకాశం ఉందని పని గంటలు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లాంటి అనేక హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో కార్మికులు అడ్డా కూలీలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని అందుకే 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 న సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమ్మెలో సింగరేణి అర్జీ 1 లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల కుమారస్వామి, మేదరి సారయ్య, తోకల రమేష్, విశ్వనాథ్, మద్దెల శ్రీనివాస్,రత్న కుమార్, ఉపేందర్,రాజు,రవి, శ్రీనివాస్,కిరణ్, రాములు,రాజేందర్,మదు, మహేందర్ లతోపాటు కార్మికులు పాల్గొన్నారు.



## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి...

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి తనిఖీ పరిశీలించిన జిల్లా కలెక్టర్...

**పెద్దపల్లిప్రతినిధి (ఆకాంక్ష న్యూస్) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ హబ్, ఆయుర్వేద హోమియో సెంటర్, ఆయుష్మాన్ భారత్ వెల్ నెస్ సెంటర్, మాతా శిశు ఆసుపత్రిలో ఉన్న డెంటల్ సెంటర్, కంటి విభాగం, గర్భిణీ మహిళల వార్డు, ల్యాబ్, ఆరోగ్య మహిళా కౌంటర్ ల, 2డి ఎకో రూం, వివిధ ఓపి రూమ్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. డయాగ్నొస్టిక్ హబ్ వద్ద అన్ని రకాల వైద్య పరీక్షలు తప్పనిసరిగా జరగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సంఖ్య పెరగాలని, దీనికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని అన్నారు. మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అన్నారు. ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు కూర్చునే విధంగా అధికంగా కుర్చీలు వేయాలని, ఓపి రూమ్ వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పెంచాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో రోగులు వీక్షించేందుకు వీలుగా 2,3 ప్రదేశాలలో టీవీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నూతనంగా ఆసుపత్రికి వచ్చిన ఆర్.ఎం.ఓ డాక్టర్ విజయ్ జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్,ఆర్.ఎం.ఓ డాక్టర్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

గోదావరిఖనిలో శాంతి ర్యాలీ నిర్వహించిన ప్రజాసంఘాల నాయకులు...

**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** ఒంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో శాంతిర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం,మావోయిస్టు పార్టీతో, శాంతి చర్యలు జరపాలని ఛత్తీస్ ఘడ్ అటవీ ప్రాంతాలో అమలు చేస్తున్న కగార్ ఆపరేషన్ ను నిలిపివేయాలని, కాల్పుల విరమణను కేంద్ర ప్రకటించాలనే ఉద్దేశంతో ఈ శాంతి ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. ఆదివాసి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా 1జనవరి 2024 నుండి ప్రారంభించడం ఆపరేషన్ కగార్ తో ఇప్పటి వరకు 510 మంది ఆదివాసులు మావోయిస్టులు బూటకపు ఎన్ కౌంటర్ లు దాడులలో హత్యగా విభజించబడ్డారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మేధావులు ప్రజాస్వామిక వాదులు ప్రజా హక్కుల సంఘాలు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరిపాలనే డిమాండ్ మేరకు మొదటి మావోయిస్టులు మూడు లేఖల ద్వారా యూట్యూబ్ ఇంటర్వ్యూలో ద్వారా శాంతి చర్చలకు లేము సిద్ధమని ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తున్నామని ప్రకటించారని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కూడా శాంతి చర్చల జరగాలని కేంద్రానికి లేఖలు రాస్తామని అన్నారని వామపక్షాలు గత కొన్ని నెలలుగా శాంతి చర్చలు జరగాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కానీ బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించలేదని ఈ దేశవ్యాప్త శాంతి చర్చలకు వస్తున్న ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు మావోయిస్టు పార్టీలలో జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసుల పోరాట సంఘ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా మురిమడుగుల మల్లయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి పౌర హక్కుల సంఘం తెలంగాణ మాదన కుమారస్వామి, ఉప్పులేటి పర్వతాలు, గూడూరు లవన్ కుమార్, రత్నకుమార్, వేల్పుల కుమారస్వామి, ఎస్ సమ్మక్క, ఎస్.కె పహిముదా, లలిత, మహమ్మదీన్, రహీం, దుర్గం నగేష్, ముడిమడుగుల సురేష్, వై యాదయ్య, ఎం సురేష్, సిహెచ్ కృష్ణ కుమార్, ఐ కృష్ణ, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు ఈ నరేష్, కే విశ్వనాథం, ఎస్ రవీందర్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నగరంలో 58 కోట్ల 43 లక్షల విలువ గల అభివృద్ధి పనులు పూర్తి చేశాం

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...

- నగరంలో డార్క్ స్పాట్ లేకుండా 352 నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు...
- కార్పోరేషన్ పరిధిలో 45 కోట్లతో నూతన సిసి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం..
- పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచేలా నూతన వాహనాలు పరికరాల కొనుగోలు..



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : గత సంవత్సర కాలంలో రామగుండం నగరంలో 58 కోట్ల 43 లక్షల విలువగల అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరిగిందని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా 9 కోట్ల 64 లక్షల రూపాయలు, ఎల్.ఆర్.ఎస్ ఇంట్రెస్ట్ ఫండ్స్ క్రింద 84 లక్షల రూపాయలు, 14వ ఆర్థిక సంఘం క్రింద 50 లక్షల రూపాయలు, టి.యు.ఎఫ్.ఐ.డి.సి క్రింద 45 కోట్ల రూపాయలు, ప్రత్యేక అభివృద్ధి కింద కోటి 84 లక్షల రూపాయలు, వరద సహాయ నిధుల కింద 65 లక్షల రూపాయల తో వివిధ అభివృద్ధి పనులిలి పూర్తి చేసామని అన్నారు. నగరంలో డార్క్ స్పాట్ లేకుండా విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించామని అన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు నూతన డ్రైయిన్ నిర్మాణ పనులు పూర్తి చేశామని , మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగించి 80 లక్షల రూపాయలతో 8 ట్రాక్టర్లు, 65 లక్షల 50 వేల రూపాయలతో 8 ట్రాలీలు, 47 లక్షల రూపాయలతో 5 ట్రాక్టర్ విత్ ట్రాలీలను, 76 లక్షల రూపాయలతో 2 జేసిబీ లను మెరుగ్గా పారిశుధ్యం నిర్వహించేందుకు కొనుగోలు చేశామని తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి అవసరమైన భద్రత సామాగ్రి కోసం 4 లక్షల 50 వేలు ఖర్చు చేశామని అన్నారు. 83 లక్షల రూపాయలతో డ్రై రిసోర్స్ కేంద్రం, 5 ఇంక్లైన్ కాలనీ వద్ద కోటి 43 లక్షల రూపాయలతో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. 4 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ రామగుండం నగరంలో నీటి సరఫరా కనెక్షన్స్ అవసరమైన డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ వేయడం వంటి పనులు పూర్తి చేశామని అన్నారు. రామగుండం నగరంలో డార్క్ స్పాట్ ఉండకుండా ఎల్ఆర్ఎస్ వడ్డీ సొమ్మును వినియోగించి 20 లక్షల రూపాయలతో స్ట్రీట్ లైట్స్, 25 లక్షల రూపాయలతో 400 ఎల్ఈడి లైట్స్, 36 లక్షల రూపాయలతో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు చేపట్టి పూర్తి చేశామని అన్నారు. 352 నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి డార్క్ స్పాట్ లేకుండా చేశామని అన్నారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టి.యూ.ఎఫ్..డి.సి) ద్వారా 45 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నగరంలోని వివిధ డివిజన్ లలో అవసరమైన చోట సీసీ రోడ్డు మురికి కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేశామని అన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా కోటి 80 లక్షల రూపాయలతో సిసి రోడ్డు అండ్ గ్రౌండ్ డ్రైనేజ్, ఓపెన్ డ్రైయిన్ నిర్మాణ పనులు పూర్తి చేసామని అన్నారు. వరద సహాయక నిధుల నుంచి 65 లక్షల రూపాయలు ఖర్చు చేసి మ్యాన్ హెూల్స్ ను మరమ్మతు పనులు పూర్తి చేశామని అన్నారు. గత సంవత్సర కాలంలో ప్రభుత్వం ఈ 58 కోట్ల 43 లక్షలు ఖర్చుచేసి అభివృద్ధి పనులు పూర్తి చేశామని రాబోయే రోజులలో కూడా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు మరిన్ని ఖర్చు చేసి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటనలో తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు జేఎల్ఏ యూనివర్సిటీ బంగారు బాట

## ఇంజనీరింగ్ బిఎస్సి అగ్రికల్చర్ మేనేజ్మెంట్ లాకామర్స్ ఎకనామిక్స్ ఫార్మసీ బయోటెక్నాలజీ కోర్సులు..

- అత్యుత్తమ ప్లేస్మెంట్ ఇంటెన్షిప్ జేఎల్ఏ సొంతం..
- ప్రపంచంలోనీ 1800 కంపెనీలతో ఒప్పందంతో 55 లక్షల ప్యాకేజీ తో ఉద్యోగ అవకాశాలు..
- యూనివర్సిటీల ఎంపికలో విద్యార్థులు జాగ్రత్త వహించాలి.. అమిత్ అగర్వాల్

హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : భారతదేశంలో ప్రైవేట్ యూనివర్సిటీ రంగంలో మొట్టమొదటి ఆఫ్ క్యాంపస్ గా జిఎల్ఏ (%+బూా%)గణేష్ లాల్ జి అగర్వాల్ యూనివర్సిటీ గా పేరు ప్రఖ్యాతలతో ముందంజలో ఉందని యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ బేగంపేటలోని యాత్ర నివాస్ హెూటల్ లో ఏర్పాటుచేసిన సెమినార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ అమిత్ అగర్వాల్ సౌత్ జోనల్ హెడ్ లక్ష్మీకాంత్ పాటూరి లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ నోయిడా, మధురాలో ప్రారంభమైన జిఎల్ఏ యూనివర్సిటీ విద్యార్థులకు అత్యుత్తమ స్థాయిలో విద్యనందిస్తు అత్యుత్తమ ప్రతిభ గల విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ బెస్ట్ ఇంటెన్షిప్, ప్లేస్మెంట్ కల్పిస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న యూనివర్సిటీగా జిఎల్ఏ ముందంజలో ఉందని వారూ పేర్కొన్నారు 1998 సంవత్సరంలో ట్రస్టు ద్వారా గ్రేటర్ నోయిడా మధుర లో ఏర్పాటై ఇలాంటి లాభాపేక్ష లేకుండా అత్యున్నత ప్రమాణాలు నిపుణులైన అధ్యాపకులతో బోధన అందిస్తుంది అన్నారు ఇండస్ట్రియల్ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ తో పాటు తమ విద్యార్థులకు తృతీయ సంవత్సరంలో ఒక సెమిస్టర్ ఐఐటీలలో చదువుకోవడం వారితో పాటు పరీక్షలు రాసే గొప్ప అవకాశం కల్పిస్తుంది అన్నారు చివరి సంవత్సరం స్పీడ్ ఇంటర్నేషిప్ అందిస్తుందని పేర్కొన్నారు గత 27 సంవత్సరాలుగా వేలాదిమంది ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసింది అని వారి పేర్కొన్నారు. తమ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులకు,




యూనివర్సిటీ ప్రపంచంలో పేరు అందిన 1800 కంపెనీలతో ఒప్పందం చేసుకొని సరాసరి 55 లక్షల ప్యాకేజీ తో పాటు కనిష్టంగా 19.5 లక్షలకు పైగా ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు తమ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులకు జమ్మూ కాశ్మీర్ ఐఐటి, గాంధీనగర్ ఐఐటి రోపర్ ఐఐటీలలో సెమిస్టర్ చదువుకునే అవకాశం కూడా ఉందని వారు తెలిపారు, యూనివర్సిటీ విద్యార్థులకు జేఈఈ మెయిన్స్ ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు100% స్కాలర్షిప్ సౌకర్యం అందిస్తున్నామని వారు తెలిపారు. తమ యూనివర్సిటీలో మొత్తం 180 సీట్లు మాత్రమే కలిగి ఉన్నాయని అగ్రికల్చర్ యూనివర్సిటీలో 60 సీట్లు కలిగి ఉన్నాయని ఇంజనీరింగ్ బిఎస్సి అగ్రికల్చర్ మేనేజ్మెంట్ ల కామర్స్ ఎకనామిక్స్ ఫార్మసీ బయోటెక్నాలజీ తదితర కోర్సులను. విద్యార్థులు అందిస్తున్నామని తెలిపారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఉన్నత విద్య కోసం యూనివర్సిటీలను ఎంపిక చేసుకునే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు వాటి పూర్తి వివరాలు జాగ్రత్తగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎల్ఏ గణేష్ లాల్ అగర్వాల్ యూనివర్సిటీ ప్రతినిధులు. హైదరాబాద్ మహానగరంలోని పలు కాలేజీల యాజమాన్యాలు లతోపాటు, కళాసాగర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో ఎన్నికైన వార్డు అధ్యక్ష, కార్యదర్శుల కు అభినందనలు: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు.

చిలకలూరిపేట, ఆకాంక్ష : నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ సమస్థాగత ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 9, 30, 36 వార్డులలో నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రత్తిపాటి క్యాంప్ కార్యాలయంలో వారిని మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు అభినందనలు తెలియజేశారు. పార్టీ కోసం విశేష కృషి చేసిన వారిని పార్టీ లో సముచిత స్థానం కల్పించే విధంగా పార్టీ ఉంటుంది అని తెలిపారు. కూటమి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను ప్రజల్లో తెలుసుకొని పోయి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొనిరావాలి ప్రత్తిపాటి అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన 9వ వార్డుకు అధ్యక్షులుగా గోపిదేశి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మామిళ్ళ దాసు, 30 వ వార్డు అధ్యక్షులుగా ఖాజా పాచ, ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్ అలీ, 36వ వార్డు అధ్యక్షులు గా ఈదర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి గా బండారు కాశియ్య ను ప్రత్తిపాటి అభినందించారు. ఈ



కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దుమలా రవి, పట్టణ, వార్డు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు కరీముల్లా, పఠాన్ సమాధ్ ఖాన్, పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ,జీఎం..



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) గోదావరిఖని పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రామగుండం ఏరియా1లో 18వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహణ ఏర్పాట్లును గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, అర్జీ-1 జీఎం లలిత్ కుమార్ పోలీస్, సింగరేణి అధికారులతో కలిసి జవహార్ లాల్ నెహ్రూ స్టేడియంను పరిశీలించారు. జాబ్ మేళాకు హాజరై నిరుద్యోగ యువతి యువకులకు సరిపడు షామియానాలు, చల్లదనం కొరకు కూలర్స్, త్రాగు నీరు, హెల్ప్ డెస్క్ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూల కొరకు ప్రత్యేక స్టాల్స్, స్టేజి ఏర్పాట్లు, అభ్యర్థుల ఎంట్రీ, ఎగ్జిట్ దారుల గురుంచి, పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి,డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, ఎస్.సి సివిల్ వర ప్రసాద్, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో పలు అభివృద్ధి పనుల పరిశీలన



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ఎఫ్ఎసి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అరుణ శ్రీ గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి పలు సమస్యలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. రామగుండం పట్టణ ప్రదాన రహదారిలో తరచుగా నీళ్ళు నిలిచిపోతున్న ఉపరితల కాలువను పరిశీలించారు. ఈ కాలువ స్థానంలో మాస్టర్ ప్లాన్ కు లోబడి కొత్త కాలువ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు . ప్రక్కన నివాసితుల సౌకర్యార్థం వేరుగా భూగర్భ మురుగు నీటి కాలువ నిర్మించడానికి ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. రామగుండంలో నిరుపయోగంగా ఉన్న సీనియర్ సిటిజన్ హాల్ భవనం పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేసి దాన్ని ఉపయోగంలోకి తీసుకురావల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం రామగుండం , మల్కాపూర్ లలో సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అవసరానికి తగ్గట్లుగా అప్ గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవేందర్ , ఎ ఇ మౌనిక , నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

# లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి...




గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : ఎలాంటి అక్రమాలకు ,అవినీతికి తావు లేకుండా రామగుండం నగరపాలక సంస్థ అన్ని సేవలను అందిస్తుందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. నిర్ణీత వ్యవధిలోనే ఫిర్యాదుల పరిష్కారం , ధృవీకరణ పత్రాల జారీ తదితర అన్ని రకాల సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు , సిబ్బంది నిజాయితీ గా , సమర్ధవంతంగా సేవలందిస్తున్నప్పటికీ ఏమైనా లోపాలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 , మొబైల్ నెంబర్ 9440446106 అందరికీ తెలిసేలా తన ఆదేశాల మేరకు కార్యాలయం లో పలు చోట్ల నగర పాలక సంస్థ ఆద్వర్యంలోనే బోర్డులు ఏర్పాటు చేయించడం జరిగిందని అన్నారు. నగర పౌరులకు సుపరిపాలన పాలన అంది%శీ%చడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

# మంథని మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక



మంథని టౌన్ (ఆకాంక్ష న్యూస్) : జిల్లా క్రిమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మామిడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి పి సతీష్ ల ఆధ్వర్యంలో మంథని మండల క్రిమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా క్యాతం కుమార్, ఉపాధ్యక్షులుగా నూక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చింతపండు రాజు, కోశాధికారిగా కనుకుంట్ల పురుషోత్తం, అడిషనల్ సెక్రటరీగా ఆరె కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అరకాల కోటేశ్వర్, సలహాదారుగా మోత్కూరి శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదని, డూప్లికేట్ మందుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యాపార పరమైన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా యూనియన్ వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, మెడికల్ దుకాణాల యజమానులు జె ఎస్ రెడ్డి ఇల్లందుల రాము, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్ మండలాల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ తనిఖీలు



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పోరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేసి.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్ లో మెట్రో చార్జీల పెంపు



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** మెట్రో చార్జీల పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో చార్జీలను భారీగా పెంచింది మెట్రో రైలు సంస్థ. హైదరాబాద్ మెట్రో వేలాది మంది ఉద్యోగులకు, విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ మెట్రోలో ప్రతి రోజు లక్షలాది మంది ప్రజలు ప్రయాణిస్తూ.. సులువుగా వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అయితే గత కొంతకాలంగా ఎల్ అండ్ టి సంస్థ నష్టాల్లో కొనసాగుతోంది. దీంతో ఛార్జీల పెంపుపై ప్రభుత్వానికి మెట్రో సంస్థ నివేదికలు అందజేసింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో చార్జీలను పెంచుతున్నట్లు మెట్రో యాజమాన్యం ప్రకటించింది. కనిష్ఠ ధర రూ.10 నుంచి రూ.12కు, గరిష్ఠ ధర రూ.60 నుంచి రూ.75కు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. పెంచిన చార్జీలు ఎల్లుండి (మే 17) నుండి అమలులోకి రానున్నట్టు మెట్రో రైలు సంస్థ వెల్లడించింది.ప్రస్తుతం మెట్రో ఆపరేషన్స్, మాల్స్ అద్దెలు, ప్రకటనల ద్వారా ఏటా రూ. 1500 కోట్ల వరకు ఆదాయం మెట్రోకు సమకూరుతోంది. తాజా చార్జీల పెంపుతో అదనంగా మరో రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే, మెట్రో చార్జీల పెంపు నిర్ణయంతో సామాన్య ప్రయాణికులపై భారం పడే అవకాశం ఉంది.

# ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం



**హైద్రాబాద్(ఆకాంక్ష న్యూస్) :** బోడుప్పల్ శివాలయములో శ్రీ వాసుదేవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మీ సౌభాగ్యవతి శారద రాజేశ్వర్ దంపతుల ఆధ్వర్యంలో మానస మారయ్య దంపతుల సహకారముతో కోటి పార్థివలింగార్చన మహోత్సవము అత్యంత వైభవముగా నిర్వహించారు. ముందుగా దీపారాధన, కలశస్థాపన ,గణపతి , గౌరీపూజ ,నవగ్రహ ఆరాధన. భక్తులు పుట్టమన్ను చేత 108 పార్థివ లింగములు చేసి ఆ శివలింగాలకు పంచామృత అభిషేకము రుద్రాభిషేకము, భస్మార్చన ,పుష్పార్చన , బిల్వార్చన, ధూప దీప నైవేద్యములతో పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధా శ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతూ... బాసర క్షేత్రంలో 12 జ్యోతిర్లింగాల దేవాలయం ఈశాన్య భాగమున కోటి పార్థివలింగ స్తూపము నిర్మించినామని అందులో కోటి (పార్థివ) శివలింగములను స్థాపన చేయదలచినామని , కోటిలో 90 లక్షల శివలింగాలను భక్తులతో చేయించడం స్థాపన చేయడం జరిగిందన్నారు ,ఇంకా 10 లక్షలు లింగాలు చేయవలసి ఉన్నదని ఆసక్తి గల మహిళా బృందం 9948332032 సంప్రదించి వారి వివరాలు తెలిపినచో పుట్టమన్ను ఉచితముగా ఇచ్చి మీతో శివలింగాలు పూజ కార్యక్రమాలు చేయించి అట్టి లింగములను కోటి పార్థివలింగ స్తూపం యందు నిక్షిప్తం చేయబడునని శర్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ వాసుదేవా సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మీ సౌభాగ్యవతి శారదా రాజేశ్వర్ , దేవాలయ అర్చకులు భాస్కర శర్మ లక్ష్మి , ప్రమీల ఆండాలు, లక్ష్మీ ప్రియ, సరిత రాధా విజయలక్ష్మి జ్యోతి వినోది, తదితరులు పాల్గొన్నారు. కోటి పార్థివలింగ పూజ అనంతరము బాసర నుండి విచ్చేసిన సరస్వతీ స్తూప పార్థివ లింగస్తుప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథశర్మ ను నిర్వాహకులు మానస మారయ్య దంపతులు సన్మానించారు.

# పుష్కరాల సందర్భంగా సీఎం పర్యటనలో నిరసన..




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా(ఆకాంక్ష న్యూస్) :** కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో తీవ్ర నిరసన చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అభిమానులు, పుష్కరాల సందర్భంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ యొక్క ఫోటోని ఫ్లెక్సీలలో చేర్చలేదంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ నిరసనకారులు, దళిత నాయకుల అవమానాన్ని నిరసిస్తూ భారీ ఎత్తున ఫ్లెక్సీలతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు అంగీకారాన్ని తెలియజేస్తూ నిరసనకు దిగారు. ఈ ఘటన ద్వారా ఆందోళన పెరిగినప్పటికీ, పోలీసులు అదుపులోకి తీసుకొని వారిని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ ఘటనతో, ప్రభుత్వ పథకాలను, పుష్కరాలను పర్యవేక్షిస్తున్న అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అన్నదాతలను గాలికొదిలేసి అందాల పోటీలతో మునిగి తెలుతున్న రాష్ట్ర ప్రభుత్వం

## రైతులు కష్టపడి పండించిన పంటలను వెంటనే కొనుగోలు చేయాలి...

### భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను గాలికొదిలేసి అందాల పోటీలతో మునిగి తెలుతున్నదని భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన పంటలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అందాల పోటీలకు బిజెపి వ్యతిరేకం కాదని,చాలా దేశాల్లో, రాష్ట్రాల్లో అందాల పోటీలు జరుగుతుంటాయి, అయితే అక్కడున్న ముఖ్యమంత్రులు లేదా ప్రధాని ఆ పోటీల్లో పాల్గొనరు, కేవలం టూరిజం పరంగా మద్దతు తెలుపుతారు.కానీ తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నదాతలను వదిలేసి, అందాల భామల పోటీలను నిర్వహిస్తోంది. కాని రాష్ట్రంలో రైతులను గాలి, ఎండ, వర్షాలకు ముప్పుపెట్టింది. రైతుల పట్ల వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బిజెపి తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.ఇప్పటికైనా రైతులు కష్టపడి పండించిన పంటలను వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చాలా చోట్ల నెలల కొద్దీ, వారాల కొద్దీ ధాన్యం కుప్పలు, వర్షాలు, ఐకేపీ సెంటర్లలో రైతుల తిప్పలు, మరణాలు జరుగుతున్నాయి.వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన వివరాల ప్రకారం... రబీలో 80 లక్షల ఎకరాల్లో పంట పండింది, అందులో 60 లక్షల ఎకరాల్లో వరి పండింది.ఇప్పటివరకు 43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.60 లక్షల ఎకరాలకు సగటుగా 2.17 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది.అందువల్ల రబీ పంట ద్వారా తెలంగాణలో 1 కోటి 30 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగింది.ప్రభుత్వం సేకరించిన ధాన్యం కేవలం 43 లక్షల మెట్రిక్ టన్నులే, ఇంకా 87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది.రైతుల ధాన్యం అకాల వర్షాలు, ఎండకు ముంచెత్తి, టార్పాలిన్లు, కాంటాలు లేక రైతులు తీవ్రమైన అవస్థలో ఉన్నారు.ధాన్యం కొనుగోళ్లలో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదు, మొత్తం కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది.కనీస మద్దతు ధర, మండీ హమాలీ ఛార్జీలు, ట్రాన్స్ పోర్టేషన్, ఐకేపీ సెంటర్లు, రైతు సంఘాలు, మార్కెట్ యార్డులు, గోడౌన్ల ఛార్జీలు, అధికారుల ఛార్జీలు, వడ్ల బస్తాలు, గన్నీ బ్యాగులు వంటి ఖర్చులు కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది.తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం మధ్యవర్తిత్వం వంటిది.రైతు భరోసా ఇంకా ఇవ్వలేదు, 4 ఎకరాలకు పైగా పంట పండించిన రైతులకు రైతు భరోసా లేదు. బోనస్ విషయం కూడా బోగస్ అయింది.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల పంటను కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని బీజేపి డిమాండ్ చేస్తోంది.యుద్ధం చేయకుండానే యుద్ధం గెలవడం అన్నది కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పిన ఒక మహత్తర సిద్ధాంతం.ప్రధాని మోదీ గారు కూడా అదే విధంగా పాకిస్థాన్, చైనా పై ఇండైరెక్ట్ యుద్ధం సాగించారు.ఆపరేషన్ సిందూర్: ఇది సీజ్ ఫైర్ కాదు, "పాస్ ఇన్ ద ఫైర్" ఆపరేషన్.భారతదేశం ఒక నెల పాకిస్థాన్ తో యుద్ధం చేస్తే అయ్యే ఖర్చు... దాదాపు రూ. 8 వేల కోట్లు. కాని, ప్రధాని మోదీ గారు చాణక్యనీతితో యుద్ధం చేయకుండా.. ఖర్చు లేకుండా.. పాకిస్థాన్ ను చావుదెబ్బ కొట్టారు.భారత సైన్యం ద్వారా పాకిస్థాన్, చైనా పై ఘన గుణపాఠం చెప్పడం జరిగింది.ఖర్చు: భారత్ రూ. 11,000 కోట్లు, పాకిస్థాన్ నష్టం రూ. 32,000 కోట్లు (రూ. లక్షకోట్ల రూపాయల నష్టం).పాకిస్థాన్ టెర్రర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా నాశనమైంది.ఆపరేషన్ సిందూర్ తో %మీుఁవ అఅ ×అఁఋుఖ% డిఫెన్స్ సామర్థ్యం, భారతీయ డిఫెన్స్ ఎక్విప్మెంట్ పై వివిధ దేశాలకు మరింత నమ్మకం పెరిగింది.భారత్ అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా తర్వాత ఐదు ప్రధాన డిఫెన్స్ ఎక్స్పోర్టర్ దేశాలలో ఒకటైంది.2013లో భారతదేశం రూ. 600 కోట్లు ఎగుమతి చేస్తుండగా, ఇప్పుడు రూ. 25,000 కోట్లు.భారతదేశంలో 2014కి ముందు 1,500 మంది ఉగ్రదాడుల్లో మరణించారు.2014 తర్వాత మోదీ గారి నాయకత్వంలో ఉగ్రవాద ఘటనలు తగ్గాయి.2014కి ముందు జమ్ము కశ్మీర్ లో 25,000 మంది మరణించగా, 2014 తర్వాత 1,400 మంది మాత్రమే.ఆపరేషన్ సిందూర్ ద్వారా 100కు పైగా టెర్రరిస్టులు, 50కు పైగా పాక్ సైనికులు చనిపోయారు.పాకిస్థాన్ కేవలం 23 నిమిషాల లోనే కాళ్ల బేరానికి వచ్చింది.పాకిస్థాన్ అగ్రికల్చర్, ఇండస్ట్రీస్ పూర్తిగా ఇండస్ నదులపై ఆధారపడి ఉన్నాయి.భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పాకిస్థాన్ కు రూ.10,000 కోట్లకు పైగా క్రాప్ డ్యామేజ్ తగిలింది.రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో 3 సంవత్సరాల్లో రష్యాకు రూ.1,45,00,000 కోట్లు ఖర్చు అయితే, భారత్–పాక్ మధ్య నెల యుద్ధం రూ. 8,00,000 కోట్లు.భారతదేశం ఇండస్ నదులని ఉపయోగించి 35,000 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి చేయవచ్చు.జమ్ము కశ్మీర్, పంజాబ్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు అదనంగా నీటిని మళ్లించవచ్చు. పాకిస్థాన్ ను నీటికి గాలిచేసి ఎడారి చేయవచ్చు.ప్రధాని మోదీ గారి నాయకత్వం..... యుద్ధం ఆవేశంతో కాదు, ఆలోచనతో, చాణక్య నీతితో చేశారు.అందుకే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు పాకిస్థాన్ దొంగదెబ్బకు .. దెబ్బకొట్టి చాణక్య నీతితో భారత్ ను గెలిపించారు.మన జవాన్లకు మద్దతుగా, వారి త్యాగాలను గౌరవించుకునేలా... త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ మే 17న శనివారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద 'మనం సైతం దేశం కోసం' తిరంగా ర్యాలీ నిర్వహించబోతున్నాం.ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, కులాలు, మతాలకు అతీతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.సీఎం రేవంత్ రెడ్డి గారు ఎన్నికలకు ముందు అనేక రకాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది.ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన డీఏలు, జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అడిగితే బ్లాక్మెయిల్ చేస్తున్నట్లు ప్రవర్తిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతగాకపోతే వెంటనే దిగిపోవాలి.పవర్ కావాలి.. పైసలు అవినీతి ద్వారా సంపాదించాలి. కాని ఉద్యోగులను చూసుకునే బాధ్యత మాత్రం మర్చిపోతోంది. లేదంటే కేంద్ర ప్రభుత్వాన్ని చూసుకోమని చెప్పడం నిగ్గు చేటు. ఉద్యోగులను చూసుకోవడంలో, వారి హక్కులను రక్షించడంలో బాధ్యతను మర్చిపోతున్నారు.తమ ప్రభుత్వ పరిధిలో సమస్యలు ఎదురైనా కేంద్ర ప్రభుత్వాన్ని మదతు ఇవ్వమని అడగడం సిగ్గుచేటు వ్యవహారం.మోసపూరితమైన ప్రభుత్వం ఏదో అనేదానిపై ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తే, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వందశాతం ఫైవ్ స్టార్ రేటింగ్ వస్తుంది. అసదుద్దీన్ ఓవైసీని కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గా రాహుల్ గాంధీ చేసుకుంటే... అంతోఇంతో పాలిటిక్స్, జాతీయవాదం, దేశభక్తి విషయంలో భావసారూప్యత కాంగ్రెస్ కు తెలియవస్తుందన్నారు.

# ఎంతటి వారిపై అయినా వాల్టా చట్టప్రకారం చర్యలు తీసుకోండి:ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

- అనుమతి లేకుండా చెట్లు నరకటానికి ఎంత ధైర్యం.....
- అధికారులు ఉపేక్షిస్తే చెట్లు మిగలవు
- చెట్ల నరికివేత ఘటనలు పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- ఈ ఘటనలపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తీవ్ర ఆగ్రహం



**చల్లపల్లి, ఆకాంక్ష :** ఇష్టారాజ్యంగా వాల్టా చట్టం ఉల్లంఘించి రోడ్ల పక్కన చెట్లను ఎవరైనా నరికితే ఉపేక్షించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం చల్లపల్లి, మోపిదేవి మండలాల పరిధిలోని పెద్దకళ్లేపల్లి రోడ్డులో దారి పొడవున పలు చోట్ల చెట్లను మట్టానికి నరికివేసిన తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. జాతీయ రహదారి-216 పక్కన మొక్కలు తగలబెట్టిన తీరు పరిశీలించారు. ఈ ఘటనలపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ పదేళ్ల క్రితం ఇచ్చిన స్వచ్ఛ భారత్ పిలుపు అందుకుని నిర్విరామంగా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి దంపతులు, వందలాది మంది స్వచ్ఛ కార్యకర్తలు ప్రతి రోజు తెల్లవారు ఝామునే లేచి రోడ్ల పక్కన చెట్లు నాటి, ట్యాంకర్లతో క్రమం తప్పకుండా నీరు పోసి వేలాది మొక్కలు పెంచుతున్నారని తెలిపారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రశంసలు అందుకుందన్నారు. వారు అందిస్తున్న స్ఫూర్తిని పట్టించుకోకుండా ఎవరికి వారు చెట్లను నరికితే సహించేది లేదన్నారు. ఒక మొక్క నాటి సంరక్షించి పెంచటం కష్టమని, అలాంటిది స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు వేలాది మొక్కలు నాటి పెంచటం గర్వకారణం అన్నారు. చెట్లను నరకటం ఉపేక్షించరాని నేరం అన్నారు. తహసీల్దార్ అనుమతి లేకుండా చెట్లు నరకకూడదని స్పష్టం చేశారు. అధికారులు ఉపేక్షిస్తే చెట్లు మిగలవు అన్నారు. నియోజకవర్గంలో అధికారులు ఖచ్చితంగా చట్టాన్ని పరిరక్షించి అమలు చేయాలని స్పష్టం చేశారు. చెట్ల సంరక్షణకు అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో సీఎం పర్యటన రూట్ ఎటు ఉంటే అటు ఇష్టారాజ్యంగా చెట్లు నరికేశారని, అలాంటి పాలన వద్దని ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. ఇంకా అలాంటి ఆలోచనలు పాటిస్తే చర్యలు తప్పవన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు వెంటనే ఇష్టారాజ్యంగా చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు నరికింది ఎంతటి వారినైనా సహించకుండా వాల్టా చట్టం అమలు చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చట్టాల అమలులో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ డీ.వనజాక్షి, ఎంపీడీఓ డాక్టర్ ఏ.వెంకటరమణ, స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీ.ఎస్.వీ సుబ్రహ్మణ్యం, వీఆర్ఓలు మత్తి గోపాలకృష్ణ, అమలేశ్వరరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి అనుకూల వాతావరణం : పురందేశ్వరి



**హనుమాన్ జంక్షన్, ఆకాంక్ష :** పరిశ్రమలు ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణ ఏర్పడిందని విశాఖపట్నం ఎంపీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఫోక్స్ ఆపిరల్స్ నిర్మాణానికి బుధవారం సాయంత్రం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో కలిసి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్ల అప్పటి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ఎన్నో వేధింపులకు గురి చేయటంతో వారిలో ఎక్కువమంది ప్రభుత్వ వేధింపులు భరించలేక రాష్ట్రం నుండి పారిపోయారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణ ఏర్పడిందని పేర్కొన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడ కు రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో తీర్చిదిద్దేందుకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని ఎక్కువ మంది పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామిక వాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వేధింపులు గురి చేసే తరిమేసిన పారిశ్రామికవేత్తలను తిరిగి ఇక్కడికి తీసుకువచ్చి వారితో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు భూములు పొందినవారు 18 నెలల లోపు పరిశ్రమల స్థాపించాలని లేకుంటే భూములను వెనక్కి తీసుకుంటామని యార్లగడ్డ హెచ్చరించారు. టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు తొండేపు దశరథ జనార్దన్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి యార్లగడ్డ వెంకట్రావు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మిట్ట మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆయన జాతీయ రహదారిపై ఫుట్పాత్ పనులను మండుటెండలో చేయిస్తుండగా తాను ఆ దారిలో వెళుతూ ఆగి ఆయనను అభినందించానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్నిస్తుందని ఏ ఇబ్బందున్న ఎమ్మెల్యే యార్లగడ్డ దగ్గర తీసుకువెళ్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఏపీయస్సాయేమ్ఈ చైర్మన్ శివశంకర్, బిజెపి నాయకులు చిగురుపాటి కుమార్ స్వామి, తుమ్మల అంజిబాబు, టిడిపి నాయకులు ముల్పూరి సాయి కళ్యాణి, దయ్యాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ 'సింధూరం' కల్నల్ సోఫియా ఖురేషి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మంత్రి విజయ్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి:రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం రాధాకృష్ణ



**చిలకలూరిపేట ,ఆకాంక్ష :** కాశ్మీర్లోని పహల్గాము లో అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు, ఉగ్రవాద శక్తులను బలపరిచే రహస్య శక్తులకు గుణపాఠం చెప్పాలనే సంకల్పంతో భారత ప్రభుత్వం చేపట్టిన సింధూరం కార్యక్రమంలో కీలక బాధ్యత నిర్వర్తించి దేశమాత నుదుట విజయ సింధూరం దిద్దిన కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారతీయ జనతా పార్టీకి చెందిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా మీద కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నుండే కాకుండా శాసనసభ్యుడుగా కూడా అనర్హత వేటువేసి భారతీయ జనతా పార్టీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు. భారత సైన్యం ఐక్యంగా సాధించిన విజయమే ఆపరేషన్ సింధూర్ అని అన్నారు. బిజెపికి సంబంధించిన సోషల్ మీడియా కార్యకర్తలతో పాటు సాక్షాత్ ఒక రాష్ట్ర మంత్రి తన వ్యాఖ్యల ద్వారా మత వివక్ష, మహిళా వివక్షకు పాల్పడడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఆపరేషన్ సింధూరం ద్వారా సాధించిన విజయ ఖ్యాతి భారతీయ జనతా పార్టీ నాయకుల వివక్షా పూరిత వ్యాఖ్యల ద్వారా నీరుకారి పోయేలా చేశారని అన్నారు. కల్నల్ సోఫియా ఖురేషి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు కున్వర్ విజయ్ షా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు. విజయ్ షా చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఖండించక పోవడం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం కారణంగా విజయ్ షా వ్యాఖ్యలు భారతీయ జనతా పార్టీ వ్యాఖ్యలు గా పరిగణించ వలసి వస్తుందని అన్నారు. భారతీయ జనతా పార్టీ మనువాద సిద్ధాంతానికి కట్టుబడి ఉందని, విజయ్ షా విమర్శలు భారతీయ జనతా పార్టీ విమర్శలుగా భావించవలసి వస్తుందని అన్నారు. ఇదేనా మీలోని దేశభక్తి అని, బిజెపి నాయకులను రాధాకృష్ణ సూటిగా ప్రశ్నించారు సింధూరం ద్వారా సాధించిన విజయాన్ని బిజెపి నాయకుల వ్యాఖ్యల ద్వారా విషాదంగా మార్చారని తీవ్రంగా విమర్శించారు. మహిళల పట్ల బీజేపీ నాయకత్వానికి ఉన్న భావన ఖురేషిపై చేసిన వ్యాఖ్యల ద్వారా తేటతెల్లమైందని అన్నారు. విజయ్ షా ను మంత్రిగా శాసనసభ్యుడుగా అనర్హుడిగా ప్రకటించడమే కాక తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మహిళలోకాన్ని గౌరవించాలని మహిళల్లో ఉన్న ఆత్మ న్యూనతా భావాన్ని పోగొట్టాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే వెంకట్రావ్ చొరవతో మురుగు సమస్య కు మోక్షం



**గన్నవరం, ఆకాంక్ష** గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవ తో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మురుగు కాలువ పూడికతీత సమస్యకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో మోక్షం లభించింది. గన్నవరం మండలం కేసరపల్లి శివారు దుర్గాపురం లో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య వెంటాడుతూ ఉంది. హెచ్ సి ఎల్ గోడను ఆనుకుని ఉన్న ప్రధాన డ్రైన్ పూడిక తీయకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు దుర్గపురం కాలనీ జలమయమయ్యేది. ఇటీవల గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో దుర్గాపురం వాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి తమ కాలనీలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా డ్రైనేజీ పూడిక తీయించి ముంపు నుండి రక్షించాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తక్షణమే డ్రైనేజీ పూడికి తీత పనులు చేపట్టాలని, పనులు పూర్తి చేసి తనకు ఫోటోలు పెట్టాలని గ్రామపంచాయతీ సిబ్బంది ని ఆదేశించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాల మేరకు గన్నవరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రంగంలోకి దిగి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టి రెండు రోజులుగా శరవేగంగా పనులు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా మరుగున పడిన మురుగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగానే స్పందించి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కు దుర్గాపురం కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్య పూర్తిస్తాయి పరిష్కారం గా ఈ కచ్చా డ్రైన్ ను పక్కా డ్రైన్ గా నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మల్లవల్లి పారిశ్రామిక వాడలో మౌలిక వసతుల కల్పనకు కృషి యార్లగడ్డ



**బాపులపాడు, ఆకాంక్ష :** మండల పరిధిలోని మల్లవల్లి గ్రామంలో లోని మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక వస్తువులు కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బుధవారం రాత్రి పారిశ్రామిక వాడలోని హరిత ట్రాన్స్ఫార్మర్ ను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్లు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన యార్లగడ్డ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు గొట్టుముక్కల రవికుమార్ మాట్లాడుతూ ఈ పారిశ్రామికవాడలో విద్యుత్ అవాంతరాలను నివారించటానికి 220 కే.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం అత్యవసరమని, గతంలో సబ్ స్టేషన్ మంజూరైనప్పటికీ ఏపీఐఐసీ భూమిని కేటాయించకపోవడంతో నిర్మాణం ఆగిపోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. పారిశ్రామిక వాడ పక్క నుంచి విద్యుత్తు లైన్ ఉన్నందున ప్రభుత్వానికి ఖర్చు తక్కువ అవుతుందని కేవలం ఐదు ఎకరాలు భూమి కేటాయిస్తే సబ్ స్టేషన్ నిర్మించుకోవడానికి వీలవుతుందని తెలిపారు. ప్రస్తుతం 4 వేల మంది కార్మికులు ఈ పారిశ్రామిక వాడలో పనిచేస్తున్నప్పటికీ సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంత పెద్ద పారిశ్రామిక వాడలో ఏపీఐఐసీ పరిపాలన భవనాన్ని కూడా నిర్మించకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా ఇక్కడ పోలీస్ అవుట్ పోస్ట్, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. వీరి సమస్యలను సావధానంగా విన్న యార్లగడ్డ ఈ సమస్యలన్నిటి పరిష్కారానికి పాటుపడతానని అవసరమైతే అసోసియేషన్ ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి మురళీధర్, కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పందుల నుండి ప్రజలకు ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి:జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

**మచిలీపట్నం, ఆకాంక్ష :** పట్టణాల పరిధిలో పందుల నుండి ప్రజలకు ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో పందుల వలన కలిగే ముప్పు నివారణ పై సంబంధిత అధికారులు, పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లాలో పందుల వలన ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా ఉంటారని, జిల్లా పశుసంవర్ధక అధికారి, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ, సాంఘిక సంక్షేమ అధికారి, ఎస్టీ సంక్షేమ అధికారి, మెప్మా పీడీ సభ్యులుగా ఉంటారన్నారు. పందుల పెంపకందారులు పందులను పట్టణాల్లో ,ఎక్కడపడితే అక్కడ పెంచకుండ, వీధుల్లో తిరగకుండా ఊరికి దూరంగా ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో పెంచుకోవాల్సి



ఉంటుందన్నారు. ఇందుకోసం వారు మహిళల స్వయం సహాయక సంఘాల మాదిరిగా ఒక సంఘంగా ఏర్పడితే వారికి ప్రభుత్వం తరఫున స్థలం గుర్తించి లీజుకు గాని, అమ్మకానికి గాని ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థలం గుర్తించడం కోసం మచిలీపట్నం ఆర్డిఓతో మాట్లాడతామన్నారు. ఈ సందర్భంగా పందుల పెంపకందారు కందుల శీను మాట్లాడుతూ మచిలీపట్నంలో 50 మంది దాకా పందుల పెంపకందారులు ఉన్నారని, తమకు స్థలం ఇస్తామన్నారు కానీ ఇంకా ఇవ్వలేదని, కరోనా వచ్చిన తర్వాత చాలా పందులు వ్యాక్సిన్ వేసినప్పటికీ చనిపోతున్నాయని, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ విషయమై జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో ఇదివరకు 3,650 పందులు ఉండేవని, ప్రస్తుతం 2,500 కు తగ్గిపోయాయన్నారు. తమ శాఖ వద్ద స్వైన్ ఫ్లూ టీకాలు (వ్యాక్సినేషన్లు) అందుబాటులో ఉన్నాయని, వాటిని పందులకు క్రమం తప్పకుండా వేస్తున్నామన్నారు. పందులు కలుషిత ఆహారం, రసాయనిక ఆహారం తినడం మూలాన సుస్థిరత్వం కోల్పోయి చనిపోవడం జరుగుతోందన్నారు. అనంతరం ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ పందుల పెంపకందారులు సంఘాలు ఏర్పడ్డాక వారికి పశుసంవర్ధక శాఖ పరిధిలో జాతీయ ప్రాజెక్టుల పథకం కింద ఆర్థిక సహాయం అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే వార్డు సచివాలయాల పరిధిలో పందుల పెంపకందారులను గుర్తించి వారితో మున్సిపాలిటీ పరిధిలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలను వివరించి వారి సమస్యలను తెలుసుకుని, వారికి కావలసిన మంచి బ్రీడ్లు, స్థలం తదితర జీవనోపాదులకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వారిలో ఎస్సీ ఎస్టీలను గుర్తించి మెప్మా పరిధిలో కూడా బ్యాంకుల నుండి ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వివి నాయుడు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, మచిలీపట్నం,గుడివాడ, ఉయ్యూరు, పెడన, తాడిగడప మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్, వెంకటేశ్వరరావు, గోపాలరావు, భవాని ప్రసాద్, డి టి డబ్ల్యూ ఓ ఫణి ధూర్జటి, పందుల పెంపకందారులు కందుల శీను, కే. నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఉద్యోగ అవకాశాలు అద్భుతం:మంత్రి కొల్లు రవీంద్ర




**మచిలీపట్నం, ఆకాంక్ష :** కృష్ణా విశ్వవిద్యాలయంలో ఫార్మసీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడం అద్భుతం అని రాష్ట్ర గనులు , భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశంసించారు.గురువారం డా బిఆర్ అంబేద్కర్ అకడమిక్ బ్లాక్ లోని రవీంద్రనాథ్ ఠాగూర్ సమావేశపు మందిరంలో మొదటిసారి ఏర్పాటు చేసిన అచివర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వవిద్యాలయంలో చదువును పూర్తి చేసుకుని ప్రాంగణ ఎంపికల ద్వారా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన యువతకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి ఉద్యోగ నియామక పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకోర్చి పిల్లలను చదివిస్తారని, చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం సాధిస్తే వారి తల్లితండ్రులను గర్వపడేలా చేసినవారవుతారని అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఎవరైతే వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారో వారు తప్పక అభివృద్ధిని సాధిస్తారన్నారు. రూ. 45 కోట్లతో విశ్వవిద్యాలయంలో సర్వ సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. పల్లె తుమ్మలపాలెం గ్రామంలో మెగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, దీని ద్వారా పెద్ద మొత్తంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. త్వరలోనే మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తికానున్నదని, ఈ నేపథ్యంలో పోర్టు ఆధారిత పరిశ్రమలు వస్తాయని, యువత ఇతర నైపుణ్యాలు అభివృద్ధి చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశమని, యువత వినూత్నంగా ఆలోచిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, ఆ దిశగా యువత కృషి చేసి అభివృద్ధి చెందాలని సూచించారు.జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, సంవత్సరాలు తరబడి ఒకే ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదని, ఇతర ఉద్యోగ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఇంజినీరింగ్, డాక్టర్ కోర్సుల వైపు కాకుండా ఇతర రంగాలను ఎంచుకోవడం కూడా చాలా అవసరం అన్నారు. స్వీయ అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఉద్యోగాలు పొందిన యువతకు ఈ సందర్భంగా సూచించారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఏడాదికి తొమ్మిది లక్షల రూపాయలు ప్యాకేజీతో ఎంపిక అవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొంత మంది విద్యార్థులు ఏడు, నాలుగు ఉద్యోగాలు పొందడం ఇక్కడ పనిచేస్తున్న అధ్యాపకుల పనితీరుకు నిదర్శనమన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దమొత్తంలో ప్యాకేజ్ ద్వారా ఉద్యోగం పొందిన విద్యార్థులను మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సత్కరించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లితండ్రులకు సత్కారం చేసి వారి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య), నెక్స్ట్ హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సిఈఓ సాయికృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, పలువురు ఆచార్యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

